నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 6 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

## కోర్టును ప్రారంభించిన హైకోర్టు జడ్జి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 5 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టు ఆవరణలో కోర్ట్ ఆఫ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ కమ్ 2 జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును శనివారం హైకోర్టు జడ్జి అలిశెట్టి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువలో ఉండడానికి ఈ కోర్టును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి కర్ణకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా రెడ్డి పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఎదులాపురం, ఏప్రిల్ 5 : కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ విధానం అమల్లోనే ఉందని.. మనతో విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌లో రద్దయి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కార్పొరేషన్ చేశారని ఆదిలాబాద్ జిల్లా ఔట్‌సోర్సింగ్ జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండ శీను, అగ్గిమల్ల స్వామి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, అదేవిధంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఆ కుటుంబంలో ఒకరికీ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ విషయంపై హరీశ్‌రావు సానుకూలంగా స్పందిస్తూ.. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఆయనను కలిసిన వారిలో జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లూరి రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామగిరి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్ముల నరేశ్, కోశాధికారి దువాస గోపాల్, సతీశ్, సంఘర్ష్ రెడ్డి ఉన్నారు.



### రెండు కిలో మీటర్లు వెళ్లాల్సిందే..

తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించాలి. బిందెడు నీళ్ల కోసం రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తున్నది. నీటి సమస్యతో పెళ్లి వేడుకలు నిర్వహించాలంటే భయపడుతున్నాం. ఆదివాసులపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. గ్రామానికి చెందిన చేతి పంపులు అడుగంటిపోనయ్.

*- వెట్టి రేణుకాబాయి, మామిడిగూడ(బీ) గ్రామస్తురాలు*



### బోర్లు, చేతిపంపులు అడుగంటాయి..

గ్రామంలోని అన్ని బోర్లు, చేతిపంపులు అడుగంటి పోయాయి. గ్రామంలో నీళ్లు లేకపోవడంతో పిట్టబోంగురం గ్రామానికి చెందిన ఉయిక బండ్డుకు చెందిన వ్యవసాయ బావి నుంచి నీళ్లు తీసుకొస్తున్నాం. మా గ్రామం నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉంది. వెళ్లడానికి దారి కూడా సరిగా లేదు. ఎడ్లబండ్లపై ట్యాంకులు ఏర్పాటు చేసి వ్యవసాయ బావికి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. కలెక్టర్ మామిడిగూడ(బీ)పై దృష్టి సారించి నీటి సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలి.

*- వెట్టి లక్ష్మణ్, మామిడిగూడ(బీ) గ్రామస్తుడు*


ఎడ్లబండ్లపై ట్యాంకులు ఏర్పాటు చేసి రెండు కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బావి నుంచి నీళ్లు తీసుకోస్తున్న ఆదివాసీ గిరిజనులు

# బండి కడితేనే.. బిందెడు నీళ్లు


- ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో ఇంటింటా ఎడ్లబండ్లపై నీటి ట్యాంకుల ఏర్పాటు
- శుభకార్యాలు నిర్వహించాలంటే భయమేస్తుందంటున్న ఆదివాసులు
- ఆదివాసుల తాగునీటి కష్టాలను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు


**రెండు కిలోమీటర్ల నుంచి ఎడ్లబండ్లలో నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు**

*హర్కాపూర్ అంద్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ(బీ) గ్రామానికి చెందిన ఆదివాసులు బిందెడు నీటి కోసం ఎడ్లబండ్లలో రెండు కిలోమీటర్ల దూరం వెళ్తున్నారు. మామిడిగూడ(బీ)లో 17 ఉమ్మడి కుటుంబాలు ఉండగా.. 250కి పైగా జనాభా ఉంటుంది. గ్రామంలోని బోర్లు, చేతిపంపులు అడుగంటి పోవడం, మిషన్ భగీరథ పథకం పని చేయక పోవడంతో వారం రోజులుగా తాగునీటి కోసం ఆదివాసులు అవస్థలు పడుతున్నారు. ప్రతి ఇంటికి ఎడ్లబండ్లపై నీటి ట్యాంకులు ఏర్పాటు చేసుకున్నారు. పిట్టబోంగురం గ్రామానికి చెందిన ఉయిక బండుకు చెందిన వ్యవసాయ బావి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఒక్కోసారి రెండు కిలోమీటర్లు నడిచి మరీ నీళ్లు తెచ్చుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. తాగునీటి కష్టాలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి ఎద్దడితో పెళ్లి వేడుకలు నిర్వహించాలంటే భయంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి కష్టాలను పరిష్కరించి ఆదుకోవాలని కోరుతున్నారు.*

*- ఇంద్రవెల్లి, ఏప్రిల్ 5*


వ్యవసాయ బావిపై ఏర్పాటు చేసిన విద్యుత్ మోటర్ పైపు ద్వారా నీళ్లు పడుతూ..


వ్యవసాయ బావికి ఎడ్లబండ్లతో వెళ్లి విద్యుత్ మోటర్ ద్వారా నీళ్లు పడుతున్న ఆదివాసీ గిరిజనులు, మహిళలు


ఎడ్లబండ్లపై ఏర్పాటు చేసిన ట్యాంకు నుంచి నీళ్లు తీసుకుంటున్న వెట్టి లక్ష్మణ్

## హీరాసుక జెండా తొలగింపుపై చర్చ

- నాగోబా ఆలయ ప్రాంతంలో భారీగా పోలీసుల బందోబస్తు
- ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ నుంచి పర్యవేక్షణ చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్


నాగోబా దర్బార్ హాల్‌లో సమావేశమై చర్చిస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 5 : కేస్లాపూర్ నాగోబా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హీరాసుక జెండాను మార్చి 28న రాత్రి గుర్తు తెలియని దుండగులు తొలగించి దహనం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు సగలకు చెందిన ఆదివాసీ గిరిజనులతో కేస్లాపూర్ నాగోబా దర్బార్‌హాల్‌లో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్ అధ్యక్షతన చర్చ వేదిక నిర్వహించారు. హీరాసుక జెండా ఘటనతోపాటు కులదేవతల ప్రత్యేకతలు, సంప్రదాయ పూజలు, ఆదివాసులకు చెందిన ధర్మ గురువుల చరిత్రపై చర్చ వేదిక నిర్వహించారు. కేస్లాపూర్ నాగోబా ఆలయ ఆవరణలో హీరాసుక జెండాను ఏర్పాటు చేయడం సరికాదని, తిరిగి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి తీర్మానం చేశారు. కాగా ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి నాగోబా దర్బార్‌హాల్‌లో జరుగుతున్న ఆదివాసుల చర్చ వేదికను పర్యవేక్షించారు. ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్ఐ దుబ్బక సునీల్ ద్వారా సమాచారం తెలుసుకున్నారు.

## ఆశయ సాధనే లక్ష్యంగా ముందుకెళ్లాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, ఏప్రిల్ 5 : బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధన దిశగా ప్రతి ఒక్కరి ఆలోచనలో మార్పు రావాలని, ఆయన ఆశయ సిద్ధాంతాలు ప్రేరణగా తీసుకుంటూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం బాబూ జగ్జీవన్ రామ్ చౌక్‌లో జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని నిర్వహించారు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, నారాయణ, మెట్టు ప్రహ్లాద్, వేణుగోపాల్ యాదవ్, బట్టు సతీశ్, భోజన్న, మద్దుల ఉషన్న, గంగన్న, సంతోష్‌రెడ్డి, ముక్కెర ప్రభాకర్ పాల్గొన్నారు.

### సమానత్వం కోసం పోరాడిన ఆదర్శనేత

**బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**

నేరడిగొండ, ఏప్రిల్ 5 : స్వాతంత్ర్యం, సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత బాబూ జగ్జీవన్‌రామ్ అని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కొనియాడారు. శనివారం మండల కేంద్రంలో ఆయన జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ వైస్ ఎంపీపీ మహేందర్ రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జాదవ్ రమేశ్, సవాయిరాం, నాయకులు అంబేకర్ పండరి, గులాబ్‌సింగ్, రుక్మణ్‌సింగ్, ప్రతాప్‌సింగ్, లింబాజీ, రాథోడ్ సురేందర్, కమలాకర్, శేఖర్, రాథోడ్ రాజశేఖర్, లవకుమార్‌రెడ్డి, మధన్‌సింగ్ పాల్గొన్నారు.


విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, నాయకులు


జగ్జీవన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

## రైతుబజార్‌లో కౌలు రైతు మృతి

**విద్యుత్ షాక్ తగిలి మృత్యువాత**


అశిలి పోచన్న(ఫైల్)

తాంసి, ఏప్రిల్ 5 : పొన్నారి గ్రామానికి చెందిన కౌలు రైతు అశిలి పోచన్న(35) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి మృత్యువాత పడ్డాడు. పోచన్న ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని టమాట, వంకాయ, బెండకాయలు, బబ్బరి వంటి కూరగాయలు పండిస్తున్నాడు. రోజు ఉదయం, సాయంత్రం కూరగాయలను ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్ పట్టణంలోని రైతుబజార్‌లో విక్రయిస్తాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కూడా తన ద్వికచక్రవాహనంపై కూరగాయలను రైతుబజార్‌కు తీసుకెళ్లాడు. రాత్రి కావడంతో తను అమ్మే స్థలం వద్ద విద్యుత్ బల్బు ఏర్పాటు చేసుకుంటున్నాడు. విద్యుత్‌ను సరి చేస్తున్న క్రమంలో షాక్ తగిలి పడిపోయాడు. చుట్టూ పక్కల ఉన్న రైతులు వెంటనే రిమ్స్‌కు తలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే కౌలు రైతు మృతి చెందడని, బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని పొన్నారి రైతులు డిమాండ్ చేశారు. పోచన్నకు భార్య మమత, కూతురు అనీష ఉంది.

## పోలీసులకు క్రమశిక్షణ తప్పనిసరి


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

ఎదులాపురం, ఏప్రిల్ 5 : ప్రతి ఒక్క పోలీసుకు క్రమశిక్షణ తప్పనిసరి అని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు నిర్వహించిన పరేడ్‌లో ఎస్పీ పాల్గొని సిబ్బందికి సూచనలు చేశారు. మొదటగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటి ఎస్పీకి గౌరవవందనాన్ని సమర్పించి, పరేడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి పోలీసు క్రమశిక్షణ అనేది మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరికి పోలీసు క్రమశిక్షణ అనేది ముఖ్యమైనదని తెలియజేశారు. ప్రతి ఒక్కరికి పోలీస్ స్టేషన్‌లవారీగా వారాంతపు సెలవును అమలు చేయాలని సూచించారు. క్రమశిక్షణ తప్పిన ఉద్యోగులపై శాఖ పరమైన చర్యలు తప్పవని తెలియజేశారు. డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్ పాల్గొన్నారు.